నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



రాజేంద్రనగర్‌: విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు రాజేంద్రనగర్‌ విద్యుత్‌ అధికారులు తెలిపారు. గాంధీనగర్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ఐసీఎం, నార్మ్‌ విద్యుత్‌ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ ఉండదన్నారు.

సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి

మణికొండ: నెక్నాంపూర్‌ చిన్న చెరువుకు ఇరిగేషన్‌ అధికారులు ఇష్టారాజ్యంగా హద్దులు నిర్ణయించి చెరువును కుదిస్తున్నారని, పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన తరువాతనే ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్‌ హద్దులు నిర్ణయించాలని మణికొండ ది సిటిజన్స్‌ కౌన్సిల్‌ ప్రధాన కార్యదర్శి షేక్‌ ఆరీఫ్‌ డిమాండ్‌ చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చెరువుకు పురాతన ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ హద్దులు ఉన్నా వాటిని కాదని, తగ్గించి ప్రహరీ నిర్మిస్తూ చెరువును కుదిస్తున్నారన్నారు. చెరువు పక్కనే ఉన్న ఓ నిర్మాణ సంస్థకు లబ్ధి చకూరేలా వారు వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని పూర్తి స్థాయిలో బఫర్‌ జోన్‌ ఉండేలా చూడాలన్నారు.



నెక్నాంపూర్‌ చెరువు వద్ద కొనసాగుతున్న పనులు

ఇండోర్‌ స్టేడియం.. అలంకారప్రాయం



ఇండోర్‌ స్టేడియంలోని స్విమ్మింగ్‌ పూల్‌ బిల్డింగ్‌

- క్రీడా పోటీల నిర్వాహణ మిథ్య వెలవెలబోతున్న కాటేదాన్‌ స్టేడియం
- స్టేడియానికి కేటాయించిన రూ. కోట్లు వృథా
- పావురాలకు నిలయంగా మారిన వైనం

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్‌ నియోజకవర్గం పరిధిలో క్రీడాకారులు, క్రీడాభిమానులకు కనీస వసతుల కల్పనలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో భారీగా నిధులు కేటాయించి స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ నిర్మించినా అదికాస్తా అలంకారప్రాయంగానే తయారైంది. ప్రస్తుతం స్టేడియం పనులు పూర్తయినా అందులో క్రీడాకారులకు కనీస వసతులు లేవు. ఫలితంగా క్రీడాకారులతో పాటు క్రీడాభిమానులకూ నిరుత్సాహం మిగిలింది.



- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కాటేదాన్‌ స్పోర్ట్స్‌ కాంప్లెక్స్‌ను రూ. 24.61 కోట్ల హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ నిధులతో సుమారు 14 సంవత్సరాలుగా నిర్మిస్తూనే వచ్చారు. అయితే గత సంవత్సరం ఎన్నికల నేపథ్యంలో గంట దాటితే ఎన్నికల కోడ్‌ అమలవుతుందంటూ స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ అధికారులతో కలిసి ఆ స్టేడియాన్ని ప్రారంభించారు. సంవత్సరం కావస్తున్నా ఇప్పటివరకు అందులో ఎలాంటి ఇండోర్‌ గేమ్స్‌ను నిర్వహించ లేదు.
- స్విమ్మింగ్‌ పూల్‌ పనులు, ఇండోర్‌ స్టేడియం, స్కేటింగ్‌ గ్రౌండ్‌ వంటివి పూర్తయినా క్రీడాపోటీలను మాత్రం నిర్వహించలేకపోతున్నారని క్రీడాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండోర్‌ స్టేడియం షెడ్డు పావురాలకు నిలయంగా మారింది. దీంతో ఆ ప్రాంతం దుర్వాసన వెదజల్లుతున్నది.
- కాంట్రాక్టర్‌ గ్రౌండ్‌ పనులు పూర్తి చేసి సంవత్సరం అవుతున్నా ఎలాంటి క్రీడా పోటీలను నిర్వహించ లేదు. స్పోర్ట్స్‌ అథారిటీ వారు గ్రౌండ్‌ను స్వాధీనం చేసుకోవాలి. అయితే ప్రారంభించినప్పటి నుంచి హార్టికల్చర్‌ విభాగం మాత్రం ఇద్దరు సిబ్బందిని నియమించి క్లీనింగ్‌ పనులను చేయిస్తున్నారు. చెట్లకు నీటిని సరఫరా చేస్తున్నారు.



కాటేదాన్‌ ఇండోర్‌ స్టేడియం



స్విమ్మింగ్‌ పూల్‌ బిల్డింగ్‌లో పాడైన డోర్‌లు

పావురాలకు నిలయంగా...

ఇండోర్‌ స్టేడియం షెడ్డు పనులు పూర్తయి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నా ఎలాంటి క్రీడలు నిర్వహించక పోవడంతో స్టేడియం లోపల దుమ్ము, ధూళితో నిండింది. పావురాల నిలయమై వాటి విసర్జకాలతో నిండిపోయింది. దీంతో అదికాస్తా దుర్గంధ భరితంగా మారింది. స్టేడియంలో ఉదయం వాకింగ్‌కు వచ్చే వారు, స్థానికులు స్కేటింగ్‌ చేసుకుంటున్నారు.

కొన్ని పనులు పూర్తికావాలి

ఇండోర్‌ స్టేడియంలో డ్రైనేజీ, మంచినీటి పనులు చేస్తే అన్ని పనులు పూర్తి చేసినట్లే. విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటు చేయాలి. స్పోర్ట్స్‌ ఆథారిటీ వారు గ్రౌండ్‌ను స్వాధీనం చేసుకొని క్రీడలు నిర్వహించుకోవచ్చు.

– శ్రీనివాస్‌, జీహెచ్‌ఎంసీ, ఈఈ

నిర్వహణ శూన్యం



పనులు పూర్తి కాకపోయినా స్టేడియంను ప్రారంభించారు. ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి క్రీడాపోటీలను నిర్వహించలేదు. ఎవరూ పట్టించుకోకపోవడంతో రూ. కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన స్టేడియం కాస్తా అలంకారప్రాయంగా తయారైంది. క్రీడా పోటీలు నిర్వహిస్తే క్రీడాభిమానులు సంతోషిస్తారు. ఈ దిశగా అధికారులు దృష్టి సారించి ఇండోర్‌ గేమ్స్‌ ప్రారంభించాలని కోరుతున్నా.

– ఎస్‌.వెంకటేష్‌, స్థానిక నాయకుడు



వాకింగ్‌ ట్రాక్‌ పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్‌ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 16వ డివిజన్‌లోని ఎర్రకుంట అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. గడచిన సంవత్సరం నుంచి మొదట కుంటలోని మట్టి, చెత్త పదార్థాలు తొలించి నీరు నిల్వ అయ్యేలా చేశారన్నారు. అలాగే కుంటలో ఎలాంటి చెత్త వ్యర్థాలు వేయకుండా ఫెన్సింగ్‌ కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు మెయిన్‌ రోడ్డులో వాకింగ్‌ చేయడం వలన వాహనాల వల్ల ప్రమాదానికి గురి అవుతున్నారని అందుకే వాకింగ్‌ చేసుకునేందుకు అనుగుణంగా ఎర్రకుంటకి ఆనుకోని వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటు పనులను ప్రారంభించామన్నారు. మరో 15 రోజుల్లో వాకింగ్‌ ట్రాక్‌ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కాంగ్రెస్‌ నాయకులు టింకు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దుర్గామాత విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన పూజలు



దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్‌: అత్తాపూర్‌ డివిజన్‌ హైదర్‌గూడలోని శ్రీ దుర్గా దేవాలయం పునఃనిర్మాణం పూర్తయిన సందర్భంగా మహాబలేశ్వరంలో రూపొందించిన దుర్గామాత విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రాణ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త చెట్టిగారి వసంతరావు ఆధ్వర్యం గణపతి హోమం, చండీయాగం నిర్వహించారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ప్రణవ భక్త సమాజం బాధ్యులు మోంద్ర నర్సింహా, మల్లారెడ్డి, వివిధ పార్టీల రాజకీయ నాయకులు కొలన్‌ సుభాష్‌రెడ్డి, చెట్టిగారి నరేందర్‌, నారగూడెం మల్లారెడ్డి, వనం నర్సింహా, రాజ్‌కుమార్‌, జయానందరెడ్డి, మ్యాడం ప్రవీణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా



బాక్స్‌ డ్రైన్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

మైలార్‌దేవ్‌పల్లి: నియోజకవర్గం పరిధిలో కాలనీలు, బస్తీలనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తానని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. దుర్గానగర్‌లో ఎస్‌ఎన్‌డీపీ నిధులతో నిర్మించిన బాక్స్‌ డ్రైన్‌ పనులును జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. కొన్ని సంవత్సరాలుగా కాలనీలో వర్షం వస్తే చెరువులా తలపించేది. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు స్థానికులు మొర పెట్టుకోగా వారి విజ్ఞప్తి మేరకు అండర్‌ గ్రౌండ్‌ బాక్స్‌ డ్రైన్‌ పనుల కోసం రూ. కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆ పనులను గత సంవత్సరం ప్రారంభించారు. పనులు పూర్తి కావడంతో రాజేంద్రనగర్‌ ఉప కమిషనర్‌ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. డ్రైన్‌ పక్కన మట్టి వేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. స్థానికులు ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. మాజీ కార్పొరేటర్‌ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్‌, ప్రేమ్‌ గౌడ్‌, సరికొండ వెంకటేష్‌ లక్ష్మారెడ్డి, జీహెచ్‌ఎంసీ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో ఆయుష్‌ వెల్‌నెస్‌ సెంటర్లు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బస్తీ దవాఖానాల్లో ఆయుష్‌ వెల్‌నెస్‌ సెంటర్లు ప్రారంభిస్తున్నారని గుడిమల్కాపూర్‌లోని కార్వాన్‌ బస్తీ దవాఖానా వైద్యాధికారి డాక్టర్‌ శ్రీకాంత్‌ అన్నారు. గురువారం బస్తీ దవాఖానాలో ఆయుష్‌ వెల్‌నెస్‌ సెంటర్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ నాయకుడు దేవర వంశీ మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ బస్తీ దవాఖానాల్లో ఆయుష్‌ వెల్‌నెస్‌ సెంటర్ల ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. డాక్టర్‌ నర్మద, డాక్టర్‌ లక్ష్మీదేవి తదితరులున్నారు.

తెలంగాణ రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్‌ ప్రభుత్వ లక్ష్యం

గోల్కొండ: తెలంగాణ రాష్ట్రాభివృద్ధే కాంగ్రెస్‌ ప్రభుత్వ లక్ష్యమని కార్వాన్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. గురువారం కార్వాన్‌ డివిజన్‌లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను కాంగ్రెస్‌ నాయకులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి మరింత పట్టుదలగా కృషి చేస్తున్నారన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో కేవలం బీఆర్‌ఎస్‌ నాయకులే తమ సన్నిహితులతో కలిసి ప్రజలకు చేరాల్సిన సంక్షేమ పథకాలను స్వాహా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రాభివృద్ధి కోసం పరిశ్రమలు స్థాపించడానికి భూములు కేటాయిస్తుంటే బీఆర్‌ఎస్‌ నాయకులు అడ్డుపడుతూ అధికారులపై దాడులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. పదేళ్లలో తాము చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి చేస్తుండడం బీఆర్‌ఎస్‌ నాయకులకు సహించడం లేదని ఆయన అన్నారు. ఆయన వెంట చంద్రశేఖర్‌, రాములు, రవీందర్‌ తదితరులున్నారు.

డిజైనింగ్‌లో సృజనాత్మకత ఉండాలి

రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో గురువారం 8 మ్యాట్రిక్స్‌ డిజైన్‌ కాన్‌క్లేవ్‌ను ఘనంగా నిర్వహించారు. మార్స్‌ మీడియా, ఇవాల్‌ స్కిల్స్‌ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఫ్యాషన్‌, జ్యువలరీ, ఇంటీరియర్స్‌, సస్టేనబిలిటీ, గేమింగ్‌, ఏఆర్‌/వీఆర్‌, ఉత్పత్తులు, హెల్త్‌కేర్‌, సాఫ్ట్‌వేర్‌, సైబర్‌ సెక్యూరిటీ లాంటి వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమల యజమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సృజనాత్మకమైన డిజైన్లు రూపొందించిన పలువురిని అవార్డులతో సత్కరించారు. ఈ సమావేశంలో టీవర్క్స్‌ సీఈఓ తనికెళ్ల జోగిందర్‌ మాట్లాడుతూ డిజైనింగ్‌ రంగంలో సృజనాత్మకతకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి అంశానికి డిజైనింగ్‌ ఎంతో ముఖ్యమని, దానికి సృజనాత్మకతను జోడిస్తే ఎన్నో వైవిధ్యాలు కనిపిస్తాయన్నారు. టీహబ్‌లోని మాథ్‌ సీఈఓ రాహుల్‌పైత్‌ మాట్లాడుతూ డిజైనింగ్‌ రంగానికి మంచి భవిష్యత్‌ ఉందన్నారు.

ఎన్యుమరేటర్లకు తప్పని ఇబ్బందులు!

అత్తాపూర్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుల గణనలో సంబంధిత ఎన్యుమరేటర్లకు సంపన్న వర్గాల నుంచి సమాధానాలు దొరకకపోవడంతో ఎన్యుమరేటర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఆలస్యం ఏర్పడుతుంది. రాజేంద్రనగర్‌ సర్కిల్‌ అత్తాపూర్‌, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, అంబియన్స్‌ ఫోర్ట్‌ తదితర ప్రాంతాలలో ఉన్న సంపన్న వర్గాల కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణనలో భాగస్వాములు కావడం లేదు. కుల గణన ప్రారంభం నాటి నుంచి పలుమార్లు వారు నివసించే అపార్ట్‌మెంట్లు, విల్లాలకు వెళ్లిన ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. సంబంధిత ఇండ్లకు పోస్టర్లు అతికించేందుకు కూడా అనుమతులు ఇవ్వలేకపోవడం వివరాలు ఇవ్వకపోవడంతో స్థానికంగా విధి నిర్వాహణలో ఉన్న ఎన్యుమరేటర్లు నిరాశ, నిస్పృహలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం విధించిన గడవు సమీపిస్తుండటంతో తమకు కేటాయించిన గృహాల్లో కుల గణన పూర్తి కాలేదు. 50 శాతం కూడా పూర్తి కాకప్లోవడంతో కొంత మంది ఎన్యుమరేటర్లకు అధికారుల నుంచి ఒత్తిడి తీవ్రం కావడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. స్థానిక ప్రజలు సహకరించక పోవడంతో జరుగుతున్న జాప్యాన్ని దృష్టిలో పెట్టుకొని మరికొంత సమయం కేటాయించాలని కోరుతున్నారు. సంపన్న వర్గాల కుటుంబాలు తమకు పూర్తిగా సహకరించే విధంగా సంబంధిత విల్లాలు, అపార్ట్‌మెంట్‌ల కమ్యూనిటీ వారికి అవగాహన కల్పిస్తే పూర్తి వివరాలు అందజేసే అవకాశం ఉంటుందని పలువురు ఎన్యుమరేటర్లు వెల్లడిస్తున్నారు.

ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలి



వట్టినాగులపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు ధర్మపురి ముదిరాజ్‌



కోకాపేటలో శాసనమండలి వైస్‌ చైర్మన్‌ బండ ప్రకాష్‌

మణికొండ: రాష్ట్ర ముదిరాజ్‌ మహాసభ ఆవిర్భావ దినోత్సవం, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం ముదిరాజ్‌లు ఘనంగా జరుపుకొన్నారు. కోకాపేటలోని ముదిరాజ్‌లకు కేటాయించిన స్థలంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి వైస్‌ చైర్మన్‌ బండ ప్రకాష్‌ పాల్గొని ముదిరాజ్‌ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముదిరాజ్‌లు అంతా ఐక్యతగా ఉండాలన్నారు. అన్ని రంగాలలో ముదిరాజ్‌లు రాణించాలని అందుకు రాష్ట్ర మహాసభ తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం కోకాపేటలో ముదిరాజ్‌లకు కేటాయించిన భూమిలో త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. అందుకు రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్‌లు అంతా సహకరించాలన్నారు. రిజర్వేషన్‌లలో బీసీ డీ నుంచి బీసీ ఏకు మార్చాలనే డిమాండ్‌తో రాబోయే రోజుల్లో పోరాటం చేస్తామన్నారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను పెంచి ముదిరాజ్‌ల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌లో వాటా ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలో ముదిరాజ్‌ భవనాలకు స్థలాలను సేకరించామన్నారు. వట్టినాగులపల్లి గ్రామంలోను ముదిరాజ్‌ జెండాను ఆవిష్కరించారు. కోకాపేటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ వైస్‌ చైర్మన్‌ ఈటి గణేష్‌, ముదిరాజ్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి మల్లేష్‌, నాయకులు యాదగిరి, సతయ్య, బాలు, కుమార్‌, సురేష్‌, సాయిరాం, రాములు, మైసయ్య, వట్టినాగులపల్లిలో ధర్మపురి ముదిరాజ్‌,నాయకులు బాలరాజు, గండయ్య రాజు, అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా గుర్రపు డెక్క తొలగింపు పనులు



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మణికొండ: నెక్నాంపూర్‌ చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను తొలగించే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గతంలో విపరీతంగా గుర్రపు డెక్క పెరగటంతో దోమల వ్యాప్తి జరిగి స్థానికంగా పలు కాలనీలలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో మున్సిపల్‌, జీహెచ్‌ఎంసీ అధికారులు దాన్ని తొలగించే పనులను చేపట్టారు. గురువారం కౌన్సిలర్‌ డి. పురుషోత్తం, కాంగ్రెస్‌ పార్టీ మున్సిపల్‌ అధ్యక్షుడు ఎం. జితేందర్‌, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌లు పనులను పరిశీలించారు. అక్కడి సిబ్బందిని అడిగి పనుల వివరాలు తెలుసుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ హద్దులు నిర్ణయించే ఫెన్సింగ్‌ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

రూ. 25.41 కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ

గచ్చిబౌలి: వరద నీరు కాలనీలను ముంచెత్తకుండా రూ.25.41 కోట్ల అంచనా వ్యయంతో నాలాల విస్తరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్‌ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సైబర్‌హిల్స్‌ కాలనీ నుంచి యూరో స్కూల్‌ వరకు, మాదాపూర్‌లోని గఫూర్‌నగర్‌ నుంచి దుర్గం చెరువు వరకు ఉన్న నాలాలను ఇంజనీరింగ్‌ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.13.86 కోట్ల వ్యయంతో సైబర్‌హిల్స్‌ నాలా, రూ.11.55 కోట్ల వ్యయంతో గఫూర్‌నగర్‌ నాలా విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. ఆర్‌సీసీ బాక్స్‌ డ్రైన్‌ నిర్మాణం వల్ల ఉపశమనం కల్గుతుందన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, నాలాల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాలు, వరద నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్‌ డీఈ ఆనంద్‌, ఏఈ జగదీష్‌, కాంట్రాక్టర్‌ పీఎస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్‌: రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేల ప్రకారం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్‌ స్టాఫ్‌ అండ్‌ ఔట్‌ సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) కార్యదర్శి కామ్రేడ్‌ వనంపల్లి జైపాల్‌ రెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన కమిషనర్‌ ఆఫ్‌ డైరెక్టర్‌ మున్సిపల్‌ అడ్మినిస్ట్రేటివ్‌ శ్రీదేవి (ఐఏఎస్‌)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కార్మిక సంఘాలు పోరాటాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రభుత్వం కనీస వేతనాలు పెంచేంత వరకు గత రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎం.ఎస్‌.నంబర్‌ 60ను 2021 జూన్‌ 11న విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలోని కొన్ని మున్సిపాలిటీలలో రెండు పూటల పని విధానాన్ని రద్దు చేసి ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్మికులను పనుల్లో కొనసాగించాలన్నారు. జీవో నంబర్‌ 60 ప్రకారం డ్రైవర్స్‌, వాటర్‌ సప్లై, ఎలక్ట్రీషియన్‌, సూపర్‌వైజర్స్‌, డేటా ఆపరేటర్స్‌లకు రూ. 19,500లు అమలు చేయాలన్నారు. కంప్యూటర్‌ ఆపరేటర్స్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్మికులకు రూ. 22,750లను అమలు చేయాలన్నారు. జీవో ఇచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వీరికి రావాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించిన కార్మిక కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

కురుమ కులస్తుల అభ్యున్నతికి కృషి: ఎంపీ ఈటల



ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో కురుమ కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. తెలంగాణలో కురుమలకు జనాభా ప్రాతిపాదికన రాజకీయ, సామాజిక స్థాయిలో సరైన న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరుతూ గురువారం కురుమ సంఘం నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఈటల రాజేందర్‌ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం బీసీలు, పేద బడుగు వర్గాలకు సరైన సామాజిక న్యాయం జరిగేలా చూడడానికి కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో మాత్రం బీసీ వర్గాలకు చెందిన కురుమలు దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం సైతం సామాజికంగా బలంగా ఉన్న వారికే అధిక ప్రాధాన్యం ఇస్తూ వారికి ఎన్నో పదవులు కట్టబెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు దేవర శ్రీనివాస్‌, కోశిక శ్రీనివాస్‌రావు, బీజేపీ కౌన్సిలర్‌ గొంగిళ్ల మహేశ్వర్‌, పెంటప్ప, సాగర్‌ తదితరులున్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలి



టోలిచౌకీ వద్ద పనులను పరిశీలిస్తున్న కౌసర్‌

గోల్కొండ: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్‌, గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టోలిచౌకీ చౌరస్తాలో జరుగుతున్న పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని, దీనికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. వర్షాకాలం కంటే ముందు ప్రారంభమైన పనులు ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. టోలిచౌకీ ఫ్లై ఓవర్‌ కింద పైప్‌లైన్‌లను ఆయన పరిశీలించి దానిపై వాడుతున్న ఇనుప జాలీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా టోలిచౌకీ డివిజన్‌లోని విరాసత్‌నగర్‌, బాల్‌రెడ్డినగర్‌ కాలనీల్లో సైతం వరద నీరు ఎక్కడికక్కడ ఆగిపోతుందన్నారు. అనంతరం ఆయన ఎండి లైన్స్‌, కంపెనీ బాగ్‌, నానల్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, నాయకులు హారూన్‌ఫరాన్‌, అబీబ్‌ చౌస్‌ ఉన్నారు.

సమైక్యంగా జీవించినప్పుడే ప్రగతి సాధ్యం



వలంటీర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌, అధ్యాపకులు

చార్మినార్‌: మనుషుల మధ్య కులమత ప్రాంతీయభాషా భేదాలను విడిచిపెట్టి సమైక్యంగా జీవించినప్పుడే ప్రగతి సాధ్యమని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌ ఆచార్య పి.బాలభాస్కర్‌ అన్నారు. హరియాణాలో ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొని బంగారు పతకం సాధించిన బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థి కార్తీక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. సమైక్య జీవన విధానంపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. ఐదేళ్లుగా సిటీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు జాతీయ శిబిరాలలో పాల్గొనడమే కాక ఉత్తమ వలంటీర్లుగా ఎంపిక కావటం గర్వకారణమన్నారు. కేంద్ర యువజన క్రీడల శాఖ నిర్వహించిన ఈ శిబిరంలో 14 రాష్ట్రాలలోని 24 విశ్వవిద్యాలయాల నుంచి 220 మంది వలంటీర్లు పాల్గొనగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వెళ్లిన బృందానికి సిటీ కాలేజీ ఆంగ్ల ఆచార్యులు డా.కృష్ణచంద్ర కీర్తి నేతృత్వం వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్తీక్‌ను వైస్‌ ప్రిన్సిపాల్‌, అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.